తాగునీటి ఎద్దడి తీరేదెన్నడో?

ప్రజలకు నీటి అవసరాలు తీర్చే విషయంలో కావలి మున్సిపాలిటీకి నేటికీ స్పష్టత ఉండడం లేదు. పట్టణ పరిధిలో లక్ష మంది జనాభా ఉంటారని అధికారుల అంచనా. అయితే వాస్తవానికి రెండున్నర లక్షల మంది జనాభా ఉన్నారు. ఇంతమందికి నీరు సరఫరా చేసేలా సమ్మర్‌స్టోరేజీలో నీరు ఉన్నా.. దీనిని శుద్ధి చేసి ప్రజలకు అందించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులకు చిత్తశుద్ధి ఉండడం లేదు. ఫలితంగా పట్టణ ప్రజలు తాగునీటికి అవస్థలు పడుతున్నారు.

- సమ్మర్ స్టోరేజీలో పుష్కలంగా నీరు
- అయినా ప్రజలకు అందించలేని స్థితిలో మున్సిపాలిటీ


కావలిలోని సమ్మర్ స్టోరేజీ ట్యాంక్

కావలి : నెల్లూరు, ప్రకాశం జిల్లా సరిహద్దుల్లో కావలి ఉండడం వల్ల ఇక్కడికి నిత్యం వలసలు జరుగుతూనే ఉంది. దీంతో పట్టణంలో జనాభా పెరుగుదల క్రమంగా పెరిగిపోతోంది. అయితే వీరికి తగ్గట్లు మున్సిపాలిటీ మాత్రం రోజుకు 90 లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నామని చెబుతోంది. కానీ అసలు నీరే రాని ప్రాంతాలు పట్టణంలో బోలెడు ఉన్నాయి. పట్టణంలో 320 కిలోమీటర్ల నీటి పైప్‌లైన్లు ఉన్నాయని మున్సిపాలిటీ చెబుతోంది. అయినప్పటికీ నీరు అందని ప్రాంతాలు అనేకం. అలాగే కొత్తగా 30 కిలోమీటర్లు మాత్రమే పైప్‌లైన్లు నిర్మిస్తే సరిపోతుందని మున్సిపాలిటీ చెబుతోంది. కానీ కనీసం మరో 100 కిలోమీటర్ల వరకు పైప్‌లైన్లు నిర్మించాల్సి ఉంది. అదేవిధంగా ట్యాంకర్ల ద్వారా పట్టణ ప్రజలకు నీటిని సరఫరా చేశామని చెప్పి మున్సిపాలిటీ అధికారులు, రాజకీయ నాయకులు కుమ్మక్కై వాటాలు పంచుకుని దిగమింగడం పరిపాటిగా మారింది.

అస్తవ్యస్తంగా పైప్‌లైన్లు

కావలి పట్టణానికి తాగునీరు అందించే సమ్మర్ స్టోరేజీ ట్యాంక్‌లో 2,250 మిలియన్ లీటర్ల నీటిని నిల్వ ఉంచుకునే సామర్థ్యం ఉంది. సోమశిల జలాలు కావలి కాలువ ద్వారా సమ్మర్‌స్టోరేజీ ట్యాంక్‌కు చేరుతోంది. ఈ నీటిని శుభ్రపరిచి పట్టణ ప్రజలకు అందించాలి. అయితే ప్రస్తుతం సమ్మర్‌స్టోరేజీ ట్యాంక్ వద్ద నీటిని శుభ్రపరిచే ప్లాంట్ సామర్థ్యం తక్కువ కావడంతో పట్టణ ప్రజలకు పూర్తి స్థాయిలో నీటిని సరఫరా చేయలేకపోతున్నారు. అందుకే కొత్తగా మరో ప్లాంట్‌ను నిర్మించినా పూర్తిస్థాయిలో వినియోగంలో లేదు. ఇప్పటికే పైప్‌లైన్లు ఉన్న చాలా ప్రాంతాలకు చుక్కనీరు చేరడం లేదు. దీనికి ప్రధాన కారణం పైప్‌లైన్లు మరమ్మతులకు గురి కావడం. నాసిరకం పైప్‌లైన్ల వల్లే ఇలా జరుగుతున్నా, అధికారులు మాత్రం దీనిని దాటవేస్తున్నారు. ఇక్కడి నేల స్వభావం రీత్యా పైప్‌లైన్లు లోతుగా తవ్వి వేయడానికి సాధ్యపడదని, అందుకే భూమిలో కొంత వరకే తవ్వి పైప్‌లైన్లు వేయడం వల్ల వాటిపై వాహనాలు రాకపోకలు సాగించడంతో పైప్‌లైన్లు పగిలిపోతున్నాయని మున్సిపాలిటీ ఇంజినీర్లు చెబుతున్నారు. పుష్కలంగా నీరు అందుబాటులో ఉన్నా.. పూర్తిస్థాయిలో పైప్‌లైన్లు లేకపోవడం వల్ల వాటిని ప్రజలకు అందించడంలో అధికారులు విఫలమవుతున్నారు.

నిర్వహణ వైఫల్యం

కావలి పట్టణంలో 520 బోర్లు ఉన్నాయి. వీటిలో ఎన్ని పని చేస్తున్నాయో, వాటి ద్వారా ఎంత నీరు ప్రజలకు అందుతుందో అధికారుల వద్ద స్పష్టత లేదు. దీనిపై ఇప్పటివరకు అధికారులు పూర్తిస్థాయిలో దృష్టి సారించలేదు. కనీసం సరఫరా చేస్తున్న నీటిని రోజూ పరీక్షలు చేసి నీటి నాణ్యతను పర్యవేక్షిస్తుండడం కూడా జరగడం లేదు. ఇదిలా ఉండగా కావలి పట్టణంలో 25,496 ఇళ్లు ఉన్నట్లుగా మున్సిపాలిటీ రికార్డులు చెబుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి ఇంటికి మున్సిపాలిటీ కుళాయి కనెక్షన్ ఇవ్వాలని, అందుకు అవసరమైన డిపాజిట్‌ను చెల్లించేలా, ప్రతినెలా కుళాయి నీటిని వినియోగించుకున్నందుకు రుసుము చెల్లించాలని స్పష్టంగా చెబుతోంది. ఈ నిబంధనలను అమలు పరుస్తామని కావలి మున్సిపాలిటీ కేంద్ర ప్రభుత్వానికి తెలియజేసింది. అయితే ఈ ప్రక్రియ కూడా కావలి పట్టణంలో అమలు జరగడం లేదు. కావలి పట్టణంలో నీటి సరఫరాకు, నిర్వహణకు విద్యుత్ బిల్లులు, సిబ్బంది జీతాలు, నిర్వహణ ఖర్చులు వెరసి మున్సిపాలిటీకి నెలకు రూ.30 లక్షలు ఖర్చవుతుంది. అస్తవ్యస్తంగా ఉన్న కావలి పట్టణంలోని నీటి సరఫరాపై మున్సిపాలిటీ అధికారులు కసరత్తు చేయాల్సి ఉంది.

క్లుప్తంగా

వధూవరులకు ఆశీర్వాదం


వధూవరులతో మేకపాటి విక్రమ్‌రెడ్డి

మర్రిపాడు : మండలంలోని పొంగూరు సర్పంచ్ ఉర్లగంటి శ్రీనివాసులురెడ్డి కుమార్తెకు ఇటీవల వివాహం జరిగింది. ఈ మేరకు పొంగూరులోని శ్రీనివాసులురెడ్డి నివాసానికి వెళ్లిన మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి నూతన వధూవరులు వెంకటసుప్రజ, ఉమా మహేశ్వరరెడ్డిలను మంగళవారం ఆశీర్వదించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి, మాజీ కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులు నాయుడు, చంద్రా నారాయణస్వామి, రఘురాం ఉన్నారు.

సీసీరోడ్ల నిర్మాణానికి నిధుల మంజూరు


సీసీరోడ్ల నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న డీఈ మణికుమార్

సీతారామపురం : మండలంలోని 14 పంచాయతీల్లో సీసీరోడ్ల నిర్మాణానికి సుమారు రూ.2.37 కోట్ల నిధులు మంజూరైనట్లు పీఆర్ డీఈ మణికుమార్ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆయన మంగళవారం పర్యటించి సీసీరోడ్లు మంజూరైన ప్రదేశాలను పరిశీలించారు. గ్రామాల్లో మట్టిరోడ్లు లేకుండా అన్ని ప్రాంతాల్లో సీసీరోడ్లు ఉండే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. త్వరలోనే సిమెంటురోడ్లు నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ఆయన వెంట పీఆర్ ఏఈ తిరుమలయ్య, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ప్రవీణ్, సుమతి, ఆయా పంచాయతీల సర్పంచ్‌లు ఉన్నారు.

రేషన్ షాపుల్లో ఆర్డీఓ పరిశీలన


తహసీల్దార్‌తో మాట్లాడుతున్న ఆర్డీఓ పావని

అనుమసముద్రంపేట : ఏఎస్‌పేట మండలంలో పలు రేషన్‌షాపులను ఆత్మకూరు ఆర్డీఓ భూమిరెడ్డి పావని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీరామకృష్ణ నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు 800 కార్డులకుపైగా ఉన్న షాపులను ప్రజలకు ఇబ్బందుల్లేకుండా డివైడ్ చేసి రెండుషాపులుగా ఏర్పాటు చేయనున్నట్లు ఆమె తెలిపారు. అనంతరం పలువురు రెవెన్యూ సమస్యలను ఆమె దృష్టికి తీసుకొచ్చారు. పరిశీలించి న్యాయం చేస్తామని వారికి ఆర్డీఓ చెప్పారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన హజరత్ ఖాజానాయబ్ రసూల్ దర్గాలో ఆమె ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

విక్రమ్‌రెడ్డి పర్యటన నేడు

చేజర్ల : ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి బుధవారం చేజర్ల మండలంలోని మడపల్లిలో పర్యటిస్తారని వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓ శుభకార్యంలో పాల్గొంటారన్నారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

చేజర్ల : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరగాల్సిన సాధారణ సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఎంపీడీఓ విజయలలిత తెలిపారు. మండలంలో మొత్తం 10 మంది ఎంపీటీసీ సభ్యులుండగా ఆరుగురు వచ్చినప్పటికీ సమావేశం మొదలయ్యే సమయానికి ముగ్గురు మాత్రమే ఉన్నారని ఎంపీడీఓ తెలిపారు. కాగా సమావేశానికి సంబంధం లేని వావిలేరు సర్పంచ్, టీడీపీ నాయకులు కలిసి కనీసం నలుగురు ఎంపీటీసీ సభ్యులు కూడా లేకుండా ఎలా సమావేశం నిర్వహిస్తారని ఎంపీడీఓతో వాగ్వాదానికి దిగారు. దీనిపై ఆమె మాట్లాడుతూ ఇద్దరు లేదా ముగ్గురు ఎంపీటీసీలతో సమావేశం వీలుకాదని, అయితే మొత్తం ఆరుగురు ఎంపీటీసీలు రిజిస్టర్‌లో సంతకం చేసి ఉన్నారని తెలిపారు. అయితే అందులో ముగ్గురు వెళ్లి పోయారని తెలియజేశారు. చివరికి కోరం లేకపోవడంతో సమావేశాన్ని ఎంపీడీఓ వాయిదా వేశారు.

పేకాట స్థావరంపై దాడులు

కలిగిరి : మండలంలోని కుమ్మరకొండూరు శివారు పొలాల్లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై కలిగిరి సీఐ పి.వెంకటనారాయణ, ఎస్సై ఉమాశంకర్ సోమవారం దాడులు చేశారు. ముగ్గురు జూదరులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.14,200 నగదును స్వాధీనం చేసుకున్నారు. జూదరులపై కేసు నమోదు చేశామని ఎస్సై ఉమాశంకర్ మంగళవారం తెలిపారు.

- **అల్లూరు** : మండలంలోని ఇస్కపల్లిలో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. రూ.35 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిశోర్ బాబు తెలిపారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టండి


మాట్లాడుతున్న ఎంపీడీఓ

అనుమసముద్రంపేట : ఏఎస్‌పేట మండల పరిధిలోని గ్రామాల్లో సమస్యలపై దృష్టి సారించాలని ఎంపీడీఓ ప్రసన్నకుమారి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచ్‌ల శిక్షణ తరగతులు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్య సమస్యలపై దృష్టి సారించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. పంచాయతీ కార్యదర్శులు సైతం గ్రామాల అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు.

ప్రతిఒక్కరికీ పని కల్పించండి

ప్రతిఒక్కరికీ ఉపాధి హామీ పనులను కల్పించాల్సిన బాధ్యత మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లపై ఉందని ఎంపీడీఓ ప్రసన్నకుమారి అన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓను సిబ్బంది సన్మానించారు.

ఏటీఎంను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి

వరికుంటపాడు : మండలంలోని తిమ్మారెడ్డిపల్లిలో ఏటీఎంను ఏర్పాటు చేయాలని పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు. తిమ్మారెడ్డిపాళెం చుట్టూ 13 గ్రామాలు ఉన్నాయి. వీరంతా ఏటీఎం కోసం వరికుంటపాడు, ప్రకాశం జిల్లా పామూరుకు వెళ్లాల్సి వస్తోంది. వరికుంటపాడులో కెనరా బ్యాంకు ఏటీఎం ఉన్నా సక్రమంగా పని చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా బ్యాంకు అధికారులు స్పందించి తిమ్మారెడ్డిపల్లి బస్టాండ్ సెంటర్‌లో ఏటీఎంను ఏర్పాటు చేయాలని పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ నేతలకు పరామర్శ


మర్రిపాడు : జంగంరెడ్డిని పరామర్శిస్తున్న మేకపాటి విక్రమ్‌రెడ్డి


కావలి : వెంకటేశ్వర్లును పరామర్శిస్తున్న రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

మర్రిపాడు : మండలంలోని పొంగూరు గ్రామంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత చింతంరెడ్డి జంగంరెడ్డి ఇటీవల మోకాళ్ల సర్జరీ చేయించుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటుండడంతో ఆయన్ను మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా సర్జరీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి, మాజీ కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులునాయుడు, మొరంరెడ్డి సుబ్బారెడ్డి, రాపూరు నాగరాజ, పార్లపల్లి కొండారెడ్డి తదితరులు ఉన్నారు.

కావలిలో..

కావలి : పట్టణంలోని 33వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు బొగ్గవరపు వెంకటేశ్వర్లు (బీవీ) నెల్లూరు అపోలో ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆయన నివాసానికి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మంగళవారం వెళ్లి పరామర్శించారు. ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు కనమర్లపూడి వెంకట నారాయణ, అమరా వేదగిరి సుబ్బరాయుడు గుప్తా, చీదెళ్ల కిశోర్‌గుప్తా, గుర్రం వెంకటేశ్వర్లు (జీవీ), కుందుర్తి శ్రీనివాసులు, గంధం ప్రసన్నాంజనేయులు, కుందుర్తి కామయ్య, దామిశెట్టి సుధీర్‌నాయుడు, నాగేశ్వరమ్మ ఉన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి


ఆత్మకూరురూరల్ : మాట్లాడుతున్న డీఏఓ సత్యవాణి


ఆత్మకూరురూరల్ : జీవామృతం తయారీని వివరిస్తున్న అధికారులు


చేజర్ల : నాగులవెలటూరులో..


ఉదయగిరి: కృష్ణంపల్లిలో..

- డీఏఓ సత్యవాణి

ఆత్మకూరురూరల్ : వ్యవసాయ, పశుసంవర్ధక, ఉద్యాన శాఖల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి పుట్టా సత్యవాణి అన్నారు. మండలంలోని ఆరవీడు, మహిమలూరులో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. మహిమలూరులో జరిగిన కార్యక్రమంలో సత్యవాణి విచ్చేసి, మాట్లాడారు. పంటల సాగులో సాంకేతిక సలహాలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయ ఏడీఏ నర్సోజీ మాట్లాడుతూ ప్రస్తుత రబీ సీజన్‌లో అనువైన వరి వంగడాలు, సాగు, యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. ఆత్మకూరు సబ్ డివిజన్ ఏడీఏ దేవసేనమ్మ మాట్లాడుతూ నానో యూరియా ప్రాముఖ్యత, ప్రకృతి వ్యవసాయం ద్వారా వరిలో ఎరువుల యాజమాన్యం, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించే విధానాలపై అవగాహన కల్పించారు. ఆత్మకూరు ఉద్యానశాఖ అధికారి రాజశేఖర్‌రెడ్డి వారి శాఖ పరిధిలో రైతులకు అందిస్తున్న రాయితీలను వివరించారు. మండల ఏఓ కిశోర్ బాబు ఈ-పంట నమోదు, సీసీఆర్ కార్డులు వల్ల ప్రయోజనాలను తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పట్టెడ చంద్రశేఖర్, సూరం ప్రసాద్‌రెడ్డి, వీఏఏ యస్దానీ, ఎంపీఈఓ నవాజ్, వ్యవసాయ సిబ్బంది ఇరగన శ్రీనివాసులు పాల్గొన్నారు.

అందుబాటులో ఉంటాం

చేజర్ల : రైతులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటామని మండల ఏఓ శశిధర్ అన్నారు. నాగులవెలటూరు, నెర్నూరు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సాగుకు ముందు విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. ఈ క్రమంలో చిత్తలూరు పొలంలో మినుము విత్తనాలకు నానో డీఏపీతో విత్తన శుద్ధి డెమోను ఆత్మ పీడీ శివన్నారాయణ చేసి చూపించారు. కార్యక్రమంలో ఏడీఏ శివనాయక్, ఎంపీఈఓ శశిధర్, వీఏఏలు మాధురి, కిరణ్, ఇమ్రాన్‌ఖాన్ పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో దిగుబడులు

ఉదయగిరి : ఆధునిక యాజమాన్య పద్ధతుల్లో సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ ఆంజనేయులు నాయక్ తెలిపారు. కృష్ణంపల్లి, శకునాలపల్లి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. స్థానిక రైతు సేవా కేంద్రాల్లో సాగులో మెళకువలను వివరించారు.

డీసీపల్లి, నందవరంలో..

మర్రిపాడు : మండలంలోని డీసీపల్లి, నందవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మండల ఏఓ రామ్మోహన్ మంగళవారం నిర్వహించారు. డీసీపల్లిలో నిమ్మ పంటను, నందవరం గ్రామంలో సాగులో ఉన్న కందిపంటను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. వెటర్నరీ వైద్యులు డాక్టర్ ఎస్.శ్వేత, ఏఈఓ వెంకటేశ్వర్లు, వీఏఏలు సుష్మ, కృష్ణవేణి, వెటర్నరీ అసిస్టెంట్లు బాలాజీ, శ్రీకాంత్ ఉన్నారు.

రూ.50కే కిలో టమోటా


కావలిలోని రైతు బజారు

కావలి : పట్టణంలోని రైతు బజారులో కిలో టమోటా రూ.50కే అమ్మకాలు చేస్తున్నట్లు రైతు బజార్ ఎస్టేట్ అధికారి మధుబాబు మంగళవారం చెప్పారు. మార్కెట్‌లో టమోటా ధరలు అధికంగా ఉండడంతో అధికారులు సబ్సిడీ ధరలకు అమ్మకాలు చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలియజేశారు.

ఈ-పంట నమోదుపై సబ్ కలెక్టర్ ఆరా

వరికుంటపాడు : మండల పరిధిలో ఈ-పంట నమోదుపై కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ మంగళవారం క్షేత్రస్థాయిలో ఆరాతీశారు. గువ్వాడి రెవెన్యూ పరిధిలోని పంట పొలాలను సందర్శించారు. పంట నమోదు, నీటి వసతి, సర్వే నంబర్, పంట రకం తదితర వివరాలను సక్రమంగా నమోదు చేశారా.. లేదా? అని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ పంటలను సాగు చేసిన ప్రతి రైతు తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ హేమంత్‌కుమార్, ఉదయగిరి మండల వ్యవసాయాధికారి ఆంజనేయులు నాయక్, వీఆర్వో ప్రసాద్‌రావు, వ్యవసాయ సహాయకులు హరినాథ్, ఆదిత్య, సర్వేయర్ రేణుక రైతులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో ప్రతిభ


బహుమతి అందుకుంటున్న హనీఫ్

సంగం : అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా నెల్లూరులో మంగళవారం క్విజ్ పోటీలను నిర్వహించారు. ఇందులో సంగం మండలానికి చెందిన ముగ్గురు విద్యార్థులు విజేతలుగా నిలిచారు. మండలంలోని మర్రిపాడు హైస్కూల్ విద్యార్థి ఎస్.సాయి, అన్నారెడ్డిపాళెం హైస్కూల్ విద్యార్థి కె.వెంకట శివకుమార్, తరుణవాయి హైస్కూల్ విద్యార్థి హనీఫ్ ప్రతిభ చూపి షార్ శాస్త్రవేత్తల చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు.

బీళ్లుగా పొలాలు


అన్నగారిపాళెంలో బీడుగా ఉన్న పొలాలు

కావలి: మండలంలోని గ్రామాల్లో పంట పొలాలు బీళ్లుగా దర్శనమిస్తున్నాయి. ఈ ఏడాది సోమశిల జలాశయంలో సాగునీరు లేక ఖరీఫ్ పంట సాగుకు నీటిని విడుదల చేయలేదు. వర్షాలు కూడా కురవకపోవడంతో రైతులు కనీసం మెట్ట పంటలను కూడా సాగుచేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో పంటలతో పచ్చగా కళకళలాడాల్సిన పొలాలు బీళ్లుగా మారాయి. సాగునీటి కాలువలు సైతం చుక్కనీరు లేక వెలవెలబోయి దర్శనమిస్తున్నాయి.

ఆర్డీఓను కలిసిన రామిరెడ్డి


ఆర్డీఓతో మాట్లాడుతున్న రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి : కావలి ఆర్డీఓగా బాధ్యతలు స్వీకరించిన ఎం.వంశీకృష్ణను మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి మంగళవారం కలిశారు. కావలి నియోజకవర్గంలో జరుగుతున్న వివిధ రకాల అభివృద్ధి పనులపై ఆర్డీఓతో చర్చించారు.

మత్స్యకార నాయకులతో..

కావలి రూరల్ మండలం తుమ్మలపెంట గ్రామంలోని మత్స్యకార నాయకులను మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కలిశారు. చేపల వేట, మత్స్యకార స్థితిగతులు గురించి వారితో చర్చించారు. ఆయన వెంట మత్స్యకార నాయకులు కొమారి రాజు, వాయిల కృష్ణమూర్తి, వాయు శ్రీరాములు, వాయిల శ్రీనివాసులు, ఆవుల పోల్, కాకి మల్లి తదితరులు ఉన్నారు.

రైతు సంఘం నేత మృతి

ఆత్మకూరు : పట్టణానికి చెందిన రైతు సంఘం నాయకుడు చెర్లో సుబ్బరామిరెడ్డి (85) అనారోగ్యంతో మంగళవారం మృతిచెందారు. పట్టణంలోని పంటవీధికి చెందిన ఆయన రైతు సమస్యల పరిష్కారం కోసం, సాగునీరు సజావుగా చెరువులకు, పంట పొలాలకు అందేందుకు, కాలువల మరమ్మతులు, పూడికతీత పనుల కోసం పోరాడిన చరిత్ర సుబ్బరామిరెడ్డిది. ఈ సందర్భంగా ఆయన మృతదేహాన్ని పలువురు సందర్శించి సంతాపం వ్యక్తం చేశారు.

లోకమాతా.. పాహిమాం


కలిగిరి: తెల్లపాడులో..


ఆత్మకూరు : కాశీనాయన ఆశ్రమంలో..


సీతారామపురం : మహాలక్ష్మి అలంకారం


సోమశిల : మల్లేశ్వరస్వామి ఆలయంలో..

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరోరోజు మంగళవారం అమ్మవార్లు వివిధ అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు విశేషంగా తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు.

ఆత్మకూరు : పట్టణంలోని అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరాలయం (శివాలయం)లో అమ్మవారు రాజరాజేశ్వరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కాశీనాయన ఆశ్రమంలోని దుర్గాదేవి, సరస్వతి ఆలయాల్లో అమ్మవారికి గాయత్రిదేవి అలంకారం చేశారు. ప్రియదర్శినినగర్‌లోని పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి ధాన్యలక్ష్మి అలంకారం చేశారు. జ్వాలాముఖి ఆలయంలో అమ్మవారికి మహాధనలక్ష్మి అలంకారం చేశారు. కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి గాయత్రి అలంకారం చేశారు.

- **కలిగిరి** : తెల్లపాడులోని భద్రకాళి ఆలయంలో అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా అలంకరించారు.
- **సీతారామపురం** : సిద్దేశ్వరంలోని ఇష్టాకామేశ్వరి దేవి, నారాయణప్పపేటలోని విజయ కనకదుర్గాదేవి మహాలక్ష్మి అలంకారంలో, సీతారామపురంలోని కన్యకాపరమేశ్వరి బాలాత్రిపుర సుందరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.
- **సోమశిల** : అనంతసాగరం మండలం కామిరెడ్డిపాడు కొండ వద్ద కొలువైన దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి శాకంబరి అలంకారం చేశారు. ఆలయ ధర్మకర్త బుట్టి భారతమ్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.
- **సంగం** : మండలంలోని సంగమేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి అన్నపూర్ణాదేవి అలంకారం చేశారు. అదేవిధంగా గంగమ్మ తల్లి ఆలయంలో అమ్మవారికి లక్ష్మీదేవి అలంకారం గావించారు.


సంగం : సంగమేశ్వరస్వామి ఆలయంలో..


సంగం : గంగమ్మ ఆలయంలో..


ఆత్మకూరు : శివాలయంలో రాజరాజేశ్వరి అలంకారం


ఆత్మకూరు : పోలేరమ్మ ఆలయంలో..


సీతారామపురం : బాలాత్రిపురసుందరీదేవిగా..